TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 290 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ శనివారం.16.05.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## వాహనదారులకు బిగ్ షాక్..

## భారీగా పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు

న్యూఢిల్లీ, అమృత్ తెలంగాణ: ఊహించనట్లే జరిగింది. ఆయిల్ కంపెనీలు వాహనదారులకు బిగ్ షాకిచ్చాయి. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరిగాయి. లీటర్ పెట్రోల్ పై రూ. 3.14 పెరగ్గా.. డీజిల్ పై రూ. 3.11 పెరిగింది. పెరిగిన ధరలు శుక్రవారం ఉదయం 6గంటల నుంచే అమల్లోకి వచ్చాయి. పశ్చిమాసియా యుద్ధ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా పెరిగాయి. ఈ కారణంగా దేశంలోని ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నాయి. దీనికితోడు దేశంలో పెట్రోల్, డీజిల్ కొరత రోజురోజుకు తీవ్రమవుతోంది. ఇప్పటికే ఉన్న నిల్వలు తగ్గిపోతున్నాయి. దీంతో పొదుపు చర్యలు పాటించాలని ప్రధాని నరేంద్ర మోదీ సైతం పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటనకు వచ్చాయి. ఈ క్రమంలో జరిగిన బహిరంగ సభలో మోదీ మాట్లాడుతూ.. పొదుపు సూచనలు చేశారు. ముఖ్యంగా ఇంధన వినియోగాన్ని తగ్గించాలని, సొంత వాహనాలకు బదులు కార్ పూలింగ్, ప్రభుత్వ రవాణా వ్యవస్థలను ఉపయోగించుకోవాలని, అలాగే ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించాలని.. ఇలా పలు రకాల సూచనలను ప్రధాని నరేంద్ర మోదీ చేశారు. దేశీయంగా గత రెండు నెలలుగా ప్రతి నెలా 37లక్షల టన్నుల పెట్రోల్, 85లక్షల టన్నుల డీజిల్ వినియోగం ఉంటోంది. దీంతో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీ)పై భారం భారీగా పెరిగిపోయింది. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై ఆయిల్ కంపెనీలకు సుమారు రూ. 55,416 కోట్ల మేర నష్టాలు వస్తున్నట్లు అంచనా. వాస్తవానికి దేశంలోని ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ప్రకటించిన మరుసటి రోజే పెట్రోల్, డీజిల్ పెరుగుతాయని ప్రచారం జరిగింది. దీంతో దేశ



వ్యాప్తంగా పెట్రోల్ బంక్ ల ముందు వాహనదారులు బారులు తీరారు. ఈ క్రమంలో పెట్రోల్, డీజిల్ ధరలు ఇప్పట్లో పెంచబోమని కేంద్రం స్పష్టం చేసింది. దీంతో పరిస్థితులు సర్దుమణిగాయి. తాజాగా.. పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయించాయి.

ప్రధాన నగరాల్లో పెట్రోల్, డీజిల్ కొత్త ధరలు ఇవే..

హైదరాబాద్ : పెట్రోల్ రూ. 110.50, డీజిల్ రూ. 98.70

విజయవాడ : 113.03, డీజిల్ రూ. 100.71

ఢిల్లీ: పెట్రోల్ రూ. 97.77, డీజిల్ రూ. 90.67

ముంబై: పెట్రోల్ రూ. 106.54, డీజిల్ రూ. 93.03

బెంగళూరు: పెట్రోల్ రూ. 105.96, డీజిల్ రూ. 93.99

చెన్నై: పెట్రోల్ రూ. 103.80, డీజిల్ రూ. 95.39

## బండి సంజయ్, కిషన్ రెడ్డి దొంగ ఓట్లతోనే గెలిచారు: కాంగ్రెస్



హైదరాబాద్: అమృత్ తెలంగాణ:మూడో దఫా ఓటర్ల జాబితా సవరణకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమైన విషయం తెలిసిందే. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ మూడో దశ నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. వచ్చే నెల 21 నుంచి తెలంగాణలో సర్ ప్రక్రియ మొదలు కానుంది. ఈక్రమంలోనే కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డిని కలిశారు. రాష్ట్రంలో జరిగే సర్ ప్రక్రియపై ఎస్ఈసీకి వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతూ .. 14 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ఓట్ల జోరీ జరిగిందని బెంగాల్ ఎన్నికలే నిదర్శనం అని టీపీసీసీ చీఫ్ ఆరోపించారు. తెలంగాణలో బండి సంజయ్, కిషన్ రెడ్డి దొంగ ఓట్లతోనే గెలిచారన్నారు.

రాష్ట్రంలో ఇప్పుడు ఎన్నికలు లేవని ఎస్ఐఆర్ ప్రక్రియ ఏడాది పొడవున చేయాలని డిమాండ్ చేశారు. సి.సుదర్శన్ రెడ్డితో కాంగ్రెస్ నేతలు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరిగే సర్ ప్రక్రియపై ఎస్ఈసీకి వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతూ .. సర్ ప్రక్రియ పారదర్శకంగా చేయాలని కోరినట్లు తెలిపారు.

## సిటీ సివిల్ కోర్టులో బండి సంజయ్ పిటిషన్



హైదరాబాద్: అమృత్ తెలంగాణ: కేంద్ర మంత్రి బండి సంజయ్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. ఫోక్సో కేసులో భవిష్యత్తులో తన పేరు వాడొద్దని పిటిషన్ వేశారు. తన పేరుతో ఇప్పటివరకు వాడిన వీడియోలు తొలగించేలా ఆదేశాలు జారీ చేయాలని న్యాయస్థానాన్ని కోరారు. మరోవైపు బండి భగీరథ్ కేసులో బాలిక వివరాలు సోషల్‌మీడియాలో ప్రసారం కావడంపై కేసు నమోదైంది. బాలిక ఫోటోలు, వీడియోలు, తల్లిదండ్రుల వివరాలు ప్రసారంపై కేసు నమోదు చేశారు. మేడ్చల్ జిల్లా బాలల సంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు చర్యలు చేపట్టారు. సోషల్‌మీడియా నిర్వాహకులపై కేసులు పెట్టినట్లు తెలిపారు.

## జూన్ 21న నీట్-యూజీ పరీక్ష





హైదరాబాద్:అమృత్ తెలంగాణ: జూన్ 21న నీట్-యూజీ పరీక్షవైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ యూజీ పరీక్ష(NEET UG 2026) తేదీని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించింది. జూన్ 21వ తేదీ, ఆదివారం రోజున పరీక్ష నిర్వహించనున్నట్లు ఎన్టీఏ వెల్లడించింది. మే 3వ తేదీన జరిగిన నీట్ యూపీ పరీక్ష పేపర్ లీకైన విషయం తెలిసిందే. దీంతో ఆ ఎగ్జామ్‌ను ఎన్టీఏ రద్దు చేసింది. అయితే విద్యార్థులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ప్రభుత్వం రీ ఎగ్జామినేషన్ తేదీని ప్రకటించింది. ఎన్టీఏకు చెందిన అధికార సమాచార ఛానల్స్‌ను మాత్రమే నీట్ అభ్యర్థులు, విద్యార్థుల పేరెంట్స్ ఫాలోకావాలని ప్రభుత్వం చెప్పింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అనుమతితోనే జూన్ 21వ తేదీన నీట్ యూజీ పరీక్షను నిర్వహించనున్నట్లు ఎన్టీఏ తన ఎక్స్ అకౌంట్‌లో పేర్కొన్నది.

## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు మళ్లీ బాంబు బెదిరింపు

హైదరాబాద్ : హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు బాంబు బెదిరింపు మెయిల్ రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. లుఫ్తాన్సాకు చెందిన ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి శంషాబాద్‌కు వస్తున్న విమానంలో బాంబు ఉన్నట్లు దుండగులు ఈ-మెయిల్ ద్వారా హెచ్చరించారు. శంషాబాద్ చేరుకునేలోగా విమానాన్ని పేల్చేస్తామని బెదిరింపు మెసేజ్ పంపారు. ఈ సమాచారం అందుకున్న వెంటనే ఎయిర్‌పోర్ట్ సిబ్బంది, భద్రతా విభాగాలు అత్యవసర చర్యలు చేపట్టాయి. విమానం ఎయిర్‌పోర్ట్‌లో సురక్షితంగా ల్యాండ్ అయిన వెంటనే దానిని ఐసోలేషన్ బేకు తరలించారు. ప్రస్తుతం భద్రతా సిబ్బంది, బాంబ్ స్క్వాడ్ అధికారులు విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.

## కార్పొరేట్ వలలో విద్య



హైదరాబాద్: అమృత్ తెలంగాణ::విద్య అనేది మనిషిని విజ్ఞానవంతుడిగా మార్చాలి.. కానీ నేడు అది విద్యార్థులను 'మార్కుల యంత్రాలు'గా, తల్లిదండ్రులను 'అప్పుల కుప్పలు'గా మారుస్తోంది. పవిత్రమైన బడిని వ్యాపార గల్లా పెట్టెగా మార్చిన కార్పొరేట్ శక్తుల కబంధ హస్తాల్లో విద్యా వ్యవస్థ చిక్కి విలవిలలాడుతోంది. సరస్వతీ నిలయాలుగా వెలవాల్సిన విద్యాసంస్థలు నేడు 'లాభాల ఫ్యాక్టరీలు'గా రూపాంతరం చెంది, అక్షరాలను అంగడి సరుకుగా విక్రయిస్తున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ప్రయివేటు, కార్పొరేట్ సంస్థల అడ్డూఅదుపు లేని దోపిడీ పర్వం మొదలవుతోంది. అడ్మిషన్లు, డొనేషన్లు, రీ-అడ్మిషన్ల పేరుతో లక్షలాది రూపాయలను పిండుకుంటూ సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి. చదువుకునే రోజులు పోయి.. చదువును కొనుక్కునే రోజులు వచ్చాయి. పాఠశాలలు కేవలం విద్యా బోధనకే పరిమితం కాకుండా, పుస్తకాలు, యూనిఫాంలు, ఇతర సామగ్రిని తమ వద్దే కొనాలని నిర్బంధిస్తూ విద్యా విలువలను తుంగలో తొక్కుతున్నాయి.

విద్యాహక్కు చట్టం (ఆర్‌టీఈ) ప్రకారం దక్కాల్సిన ఇరవై ఐదు శాతం ఉచిత సీట్లు కాగితాలకే పరిమితం కావడం, ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ కార్పొరేట్ శక్తులకు పరోక్షంగా కొమ్ముకాయడం అత్యంత విచారకరం ఈ కార్పొరేట్ మాయాజాలం నేడు పట్టణాల నుండి చాపకింద నీరులా పల్లెలకు విస్తరించింది. తమ పిల్లలు గొప్ప చదువులు చదివి ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆశపడే గ్రామీణ పేద, మధ్యతరగతి తల్లిదండ్రుల బలహీనతను ఈ సంస్థలు పెట్టుబడిగా మార్చుకుంటు న్నాయి. కాయకష్టం చేసే సామాన్యుడు సైతం లక్షల రూపాయలు ఫీజులు చెల్లించలేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు. ముఖ్యంగా ఇంటర్మీడియట్ స్థాయిలోనే రెండు సంవత్సరాలకు గాను రెండు నుండి నాలుగు లక్షల రూపాయల వరకు వసూలు చేస్తున్నారంటే దోపిడీ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ర్యాంకుల హోరులో సామాన్యుడి కన్నీటి జోరు ఎవరికీ వినిపించడం లేదు.

అయితే, ఇంత భారీ మూల్యం చెల్లిస్తున్నా విద్యార్థులకు అందుతున్నది మాత్రం 'యాంత్రిక విద్యే'. తెల్లవారుజామున 5 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు విద్యార్థులను కేవలం మార్కుల యంత్రాలుగా మార్చే ప్రయత్నం జరుగుతోంది. ఇక్కడ శాస్త్రీయ విద్యా విధానానికి చోటు లేదు, కేవలం 'బట్టీ పద్ధతి'కే పెద్దపీట వేస్తున్న పరిస్థితి ఉంది. కనీస వసతులు లేని ఇరుకు గదులు, గాలి వెలుతురు చొరని భవనాలు, ఆటస్థలం లేని ప్రాంగణాలు నేడు విద్యా సంస్థల ముఖచిత్రంగా మారాయి. ఈ మానసిక ఒత్తిడిని తట్టుకోలేక ఎందరో విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తును అర్ధాంతరంగా ముగించుకుంటూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులకే ప్రాధాన్యతనిస్తూ, సామాజిక శాస్త్రాలు (హెచ్ఈసీ, సీఈసీ)లను కనుమరుగు చేస్తున్న ఈ వ్యవస్థ, రేపటి సమాజానికి అవసరమైన బహుముఖ ప్రజ్ఞాశాలలను సమాధి చేస్తోంది.వ్యవస్థ మారాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని సమగ్ర ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలి. ప్రతి పాఠశాల వసూలు చేసే ఫీజు వివరాలను పారదర్శకంగా బహిరంగ పరచాలి. నిబంధనలు అతిక్రమించే సంస్థల గుర్తింపును నిర్మొహ మాటంగా రద్దు చేయాలి. అంతర్జాతీయ స్థాయిలో అమలవుతున్న శాస్త్రీయ విద్యా విధానాన్ని మన పాఠ్యాంశాల్లో చేర్చాలి. అన్నిటికంటే ముఖ్యంగా, ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసి, కార్పొరేట్ సంస్థలకు దీటుగా మౌలిక వసతులు, నాణ్యమైన విద్యను పేదలకు ఉచితంగా అందించాలి. విద్యార్థిని ఒక యంత్రంగా కాకుండా, విలువలతో కూడిన మనిషిగా తీర్చిదిద్దే బాధ్యతను ప్రభుత్వం, సమాజం కలిసి తీసుకోవాలి. అప్పుడే ఈ 'కార్పొరేట్ చెరసాల' నుండి చదువులమ్మకు విముక్తి లభిస్తుంది.

## 'పీఎంజే' దోపిడీ కేసులో ముగ్గురి అరెస్ట్




కరీంనగర్ / కరీంనగర్ క్రైమ్ .అమృత్ తెలంగాణ:అది ఒక సాధారణ దోపిడీ కాదు.. పక్కా కార్పొరేట్ నెట్‌వర్క్. అక్కడ దొంగలకు నెలనెలా జీతాలు ఉంటాయి. దోచుకున్న సొమ్ములో ఇన్సెంటివ్‌లు ఉంటాయి. పక్కా ప్రణాళిక, ఆధునిక సాంకేతికత, నకిలీ గుర్తింపు కార్డులతో ఈ గ్యాంగ్ దేశవ్యాప్తంగా జ్యువెలరీ షాపులు, బ్యాంకులను టార్గెట్ చేస్తోంది. ఇందులో భాగంగానే సినిమా స్క్రీన్ ప్లేను తలపించేలా దోపిడీ చేసిన కరీంనగర్ పీఎంజే జ్యువెలరీ కేసులో పోలీసులు విస్తుపోయే నిజాలను వెలుగులోకి తెచ్చారు. ఈ భారీ దోపిడీ వెనుక ఉన్న అంతర్రాష్ట్ర ముఠాను ఛేదించి, ప్రధాన సూత్రధారులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో గురువారం మీడియా సమావేశంలో సీపీ గౌస్ ఆలం వెల్లడించారు.

జైలు నుంచే 'గోల్డెన్ థీఫ్' ఆపరేషన్

ఈ దోపిడీ వెనుక ఉన్నది సామాన్యుడు కాదు. బీహార్ జైలులో ఉంటూనే దేశవ్యాప్తంగా నెట్‌వర్క్ నడుపుతున్న సుభోద్ సింగ్, అలియాస్ 'ది గోల్డెన్ థీఫ్'. ఇతని ముఠాలో సభ్యులకు కంపెనీల్లో లాగే నెలకు నిర్ణీత జీతాలు చెల్లిస్తారు. అంతేకాకుండా, దోపిడీ చేసిన సొమ్ములో 10 నుంచి 15 శాతం వరకు ఇన్సెంటివ్స్ కూడా ఇస్తారు. ఈ ముఠా లోని సభ్యుల్లో దోపిడీలో పాల్గొనే సమయం వరకూ ఎవరెవరనేది వారికీ తెలి యదు. వారికి నకిలీ పేర్లు అంట గట్టి.. ఆపేర్లతోనే చలామణి అయ్యేలా చూ స్తారు. ఒక నిందితుడు పట్టు బడ్డా.. మిగిలిన వారెవరనేది తెలి యకుండా జాగ్రత్త పడతారు. ఈ మాఫియా ఒక క్రైమ్ సిండికేట్‌లాగా పని చేస్తుంది. ఆధునిక సాంకేతికతను వాడుకోవ డంలో వీరు ఆరి తేరిన వారు. సుభోద్ సింగ్ ఆదేశాల మేరకు రఘునాథ్ కర్మాకర్ (జగీరా సింగ్), రవీష్ కుమార్, రాధే, మిశ్రా, సనోజ్ ఐదుగురు నిందితులు రెండు నెలల కిందటే తెలంగాణకు చేరుకున్నారు. దొరక్కుండా ఉండేం దుకు జార్ఖండ్-బెంగాల్ సరి హద్దుల్లో మెహతాబ్‌ఖాన్ అనే వ్యక్తి వద్ద ఒక్కో సిమ్ కార్డును రూ.10వేల చొప్పున కొను గోలు చేశారు. ముందుగా ఖమ్మం, సిద్దిపేట, పెద్ద పల్లి, కరీంనగర్ ప్రాంతా ల్లోని భారీ షోరూమ్ లపై కన్నేసి, చివరకు కరీంనగర్ పీఎంజే షాపు ను ఎంచుకున్నారు. దోపిడీకి రెండు రోజుల ముందు (మే 1న) వీరు ధర్మపురిలోని విజయలక్ష్మి గెస్ట్ హౌస్‌కు మకాం మార్చారు. మే 2న జగీరాసింగ్ మంచిర్యాల మీదుగా రైలులో మహారాష్ట్రలోని చంద్రపూర్ వెళ్లి.. గడ్ చందూర్ పరిసరాల్లో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి 6 పిస్టల్స్, మ్యాగజైన్లు తీసుకుని తిరిగి వచ్చాడు.

ఆ రోజు ఏం జరిగింది?

మే 3వ తేదీన ధర్మపురి నుంచి రెండు బైక్‌లపై బయలు దేరిన నిందితులు, వెలిచాల ఎక్స్ రోడ్ వద్ద నకిలీ నంబర్ ప్లేట్లు మార్చారు. ఆ తర్వాత పక్కా వ్యూహంతో షాపులోకి ప్రవేశించారు. ముందుగా రాధే అనే నిందితుడు కస్టమర్‌లా లోపలికి వెళ్లి పరిస్థితిని గమనించాడు. అతని నుంచి సిగల్ అందగానే మిగిలిన వారు పిస్టల్స్‌తో లోపలికి చొరబడి సిబ్బందిని బెదిరించారు. స్టాఫ్ అడ్డుకోవడానికి ప్రయత్నించ గా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో నలుగురు సిబ్బంది గాయపడ్డారు. 161.4 తులాల బంగారం, 112 క్యారెట్ల వజ్రాభరణాలను బ్యాగుల్లో నింపుకుని పరారయ్యారు.

సినిమా ఫక్కీలో ఎస్కేప్ ప్లాన్!

దోపిడీ అనంతరం పోలీసులను ముప్పు తిప్పలు పెట్టేలా దుండగుల ఎస్కేప్ ప్లాన్ సాగింది. ఒక బ్యాగ్‌ను దొంగతనం సమయంలో ఆందోళనలో షాపులోనే వదిలేసినా.. మిగిలిన బ్యాగ్‌తో పల్సర్, అపాచీ బైక్‌లపై ధర్మపురికి చేరారు. ముగ్గురు నిందితులు రవీష్ కుమార్, రాధే, సునోజ్ పల్సర్ బైక్‌ను ధర్మపురి గోదావరి ఒడ్డున వదిలేసి, నదిని దాటి మంచిర్యాల నుంచి రైలులో బీహార్‌కు పరారయ్యారు. జగీరా సింగ్, మిశ్రా అపాచీ బైక్‌పై గుండాల అడవుల్లోకి వెళ్లి, అక్కడ ముందుగా సిద్ధంగా ఉన్న ఒక తెల్లటి క్రెటా కారుకు నగలు, బైక్ అప్పగించి వారు కూడా రైలులో పరారయ్యారు.

పోలీసుల వేటలో దొరికిన కీలక నిందితులు

సీపీ గౌస్‌ఆలం నేతృత్వంలో ఐదు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. సీసీటీవీ ఫుటేజ్, సెల్ టవర్ డంప్, ఇతర సాంకేతిక నిఘా ఆధారంగా మొత్తం ముఠా గుట్టను విప్పారు. ఈముఠాలీడర్ సుభోద్ సింగ్ (మాస్టర్ మైండ్) ప్రస్తుతం జైలులో ఉన్నా దేశవ్యాప్తంగా భారీ దోపిడీలకు స్కెచ్ వేసినట్టు తేల్చారు. ఈ దోపిడీలో లాజిస్టిక్స్, ఫైనాన్స్, రెక్కీ, డ్రైవింగ్.. ఇలా వేర్వేరు పాత్రలు పోషించిన మొత్తం 13 మంది నిందితులను గుర్తించారు. వీరిలో ప్రధాన నిందితుడు జగీరా సింగ్‌ను మే 13న సాయంత్రం 4 గంటలకు వెలిచాల ఎక్స్ రోడ్ వద్ద పోలీసులు అరెస్టు చేశారు. మరో ఇద్దరిని (రవీష్ కుమార్, మెహతాబ్ ఖాన్) బీహార్, బెంగాల్‌లో అదుపులోకి తీసుకుని ట్రాన్సిట్ వారెంట్‌పై నగరానికి తీసుకొచ్చారు.

# పశు వైద్యశాల ఆవరణలో షెడ్ల నిర్మాణానికి కలెక్టర్ రాజర్షిషా ఆదేశం





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ జిల్లా కేంద్రంలోని పశువైద్యశాల ఆవరణను జిల్లా కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం సందర్శించారు. పశువైద్యశాల వెనుక భాగంలో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన కాంపౌండ్ వాల్‌ను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ చెక్‌పోస్టుల వద్ద స్వాధీనం చేసుకుంటున్న పశువుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టుబడిన పశువులను నేరుగా గోశాలలకు తరలించడం వల్ల అక్కడ స్థల సమస్యలు నిర్వహణ ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ సమస్య పరిష్కారానికి పశువైద్యశాల ఆవరణలోని ఖాళీ స్థలంలో తక్షణమే షెడ్ల నిర్మాణాన్ని చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

స్వాధీనం చేసుకున్న పశువులను ఈ తాత్కాలిక షెడ్లలో ఉంచి, వాటికి అవసరమైన వెటర్నరీ వైద్య పరీక్షలు, చికిత్స అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య శాఖ అధికారి రామారావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీల సంక్షేమం, హక్కుల రక్షణకు కట్టుబడి ఉన్నాం

## దళితవాడల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

## అట్రాసిటీ కేసుల్లో జాప్యం లేకుండా పరిహారం అందించాలి : జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల్ శంకర్






అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ జిల్లాలో షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) సంక్షేమానికి, వారి చట్టపరమైన హక్కుల రక్షణకు యంత్రాంగం పూర్తిగా కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ, ఎస్సీ సామాజిక వర్గాల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చట్టపరమైన రక్షణలు క్షేత్రస్థాయిలోని అర్హులైన నిరుపేదలకు నేరుగా చేరాలని ఆకాంక్షించారు. దళితవాడల్లో మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సంక్షేమ నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత పాటించాలని, బాధితులకు సకాలంలో న్యాయంతో పాటు పరిహారం అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, ఎస్సీల రక్షణకు సంబంధించిన చట్టాలను జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని, బాధితులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారాన్ని తక్షణమే విడుదల చేయాలని పోలీస్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. విజిలెన్స్ కమిటీ తరచుగా సమావేశమై కేసుల పురోగతిని సమీక్షించాలని, ఎస్సీలపై ఎలాంటి వేధింపులు జరగకుండా యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామ స్థాయిలో పౌర హక్కుల దినోత్సవాలను పకడ్బందీగా నిర్వహించి ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంచాలన్నారు. అర్హులైన ఎస్సీ యువతను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు స్వయం ఉపాధి పథకాల ద్వారా పూర్తి స్థాయిలో చేయూతనిస్తామని కలెక్టర్ వెల్లడించారు. వివిధ పథకాల కింద పెండింగ్‌లో ఉన్న సబ్సిడీ యూనిట్ల గ్రౌండింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఏఎస్పీ ఋత్విక్ సాయి కొట్టే, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సునీత, ఆర్డీవో జగదీశ్వర్ రావ్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పుస్తక పఠనంతోనే విజ్ఞాన శిఖరాలకు చేరవచ్చు

## మొబైల్ వినియోగం తగ్గించి గ్రంథాలయాలకు రావాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా







అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' విద్యా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన 'లైబ్రరీ డే' వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో విద్యార్థులు, యువత మొబైల్ ఫోన్ల వినియోగాన్ని తగ్గించి, గ్రంథాలయాలను ఎక్కువగా సందర్శించే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. గ్రంథాలయాలు జ్ఞానానికి హృదయ స్పందన వంటివని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఇవి బలమైన పునాది వేస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. "విద్య పేదవారి తలరాతను, రాష్ట్ర భవిష్యత్తును మారుస్తుందనే నినాదాన్ని గుర్తు చేస్తూ, ప్రతి విద్యార్థి పుస్తక పఠనాన్ని నిత్య అలవాటుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న అపారమైన జ్ఞాన సంపదను వినియోగించుకుని సమాజంలో గొప్ప నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. గ్రంథాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనలు, బుక్ టాక్స్ పఠన కార్యక్రమాలు విద్యార్థులను, సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్రంథాలయాన్ని చురుగ్గా వినియోగిస్తూ నిరంతరం పఠనంలో పాల్గొంటున్న ఉత్తమ పాఠకులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించి, వారికి పుస్తకాలను బహుకరించారు. జిల్లాలో పఠన సంస్కృతిని మరింత బలోపేతం చేయడానికి కమ్యూనిటీ రీడింగ్ డ్రైవ్, పుస్తక విరాళాల సేకరణ వంటి వినూత్న కార్యక్రమాలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చివరగా, "నేడు చదవండి -- రేపు నాయకులుగా ఎదగండి" అనే స్ఫూర్తిదాయక సందేశంతో విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, వివిధ శాఖల అధికారులు, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన తహసిల్దార్

అమృత్ తెలంగాణ మే 15: ఇందల్ వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి, వెంగల్ పాడ్ గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం తహసిల్దార్ గుర్రం బాలయ్య ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులు పడుతున్న ఇబ్బందులు తదితర విషయాలను, రైతులకు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జ్ లను అడిగి తెలుసుకుని జిల్లా స్థాయి అధికారులకు కొనుగోలు,లారిలు, రైస్ మిల్లర్లు తదితర వాటిపై ఫోన్లో వివరించారు. ధాన్యాన్ని వెంటది వెంట కంట చేస్తూ లారీలలో ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లుకు తరలించే విధంగా చూడాలని కేంద్రాల ఇన్చార్జి లను ఆదేశించారు. ఆయా కేంద్రాలలో ఉన్న స్థితిగతులపై అధికారులకు వివరిస్తామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని వివరించారు. ఈ కార్యక్రమంలో జిపిఓ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో నిర్లక్ష్యం చేస్తున్నారు : జీవన్ రెడ్డి ఆగ్రహం



జగిత్యాల అమృత్ తెలంగాణ మే 15: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి ఆరోపించారు. రైతులు పంట అమ్ముకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని, తూకాల్లో నష్టపోతున్నారని, రవాణాకు లారీలు, గన్ని బ్యాగుల కొరత ఉందని ఆయన తెలిపారు. కేంద్రీయ విద్యాలయం, యంగ్ ఇండియా స్కూల్‌లకు వెంటనే స్థలం కేటాయించాలని, ఎమ్మెల్యేలు సీఎం వద్ద సమస్యలు పరిష్కరించాలని ఆయన సూచించారు.

# తాటిపల్లి, లంబాడీపల్లి లో విద్యుత్ అంతరాయం



జగిత్యాల అమృత్ తెలంగాణ మే 15: జగిత్యాల పరిధిలోని మల్యాల మండలం తాటిపల్లి సబ్ స్టేషన్ పరిధిలో, తాటిపల్లి మరియు లంబాడిపల్లి గ్రామాల్లో శనివారం, మే 16, 2026న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. 33 కె.వి కొండగట్టు ఫీడర్ నందు ఏ బి స్విచ్ లు బిగించే పనులు జరుగుతున్నందున ఈ అంతరాయం కలుగుతుంది. త్రి ఫేస్ విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. గృహ వినియోగదారులకు ఉదయం 10.30 గంటల నుండి సింగల్ ఫేస్ సరఫరా అందుబాటులో ఉంటుంది. వ్యవసాయ బావులకు మరియు పబ్లిక్ వాటర్ సప్లై సర్వీస్ లకు ఉదయం 9.00 గంటల నుండి విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ దయానంద్ తెలిపారు. రైతులు సహకరించాలని ఆయన కోరారు.

# అత్యవసర సమయంలో రక్తదానం చేసిన యువకుడు




జగిత్యాల అమృత్ తెలంగాణ మే 15: జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రానికి చెందిన షేక్ ఫాజియా బేగం అనే మహిళకు డెలివరీ సమయంలో "ఎ" పాజిటివ్ రక్తం అవసరం కావడంతో, మల్యాల కేంద్రానికి చెందిన షేక్ శంశుద్దీన్ అనే యువకుడు వెంటనే స్పందించి జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేశాడు. ఈ విషయాన్ని మల్యాల మండల చిరంజీవి అభిమాన సంఘం అధ్యక్షుడు దూడం రామాంజనేయులు తెలిపారు. ఈ సంఘటన జగిత్యాల జిల్లాలో జరిగింది

# అన్ లోడింగ్ ప్రక్రియ త్వరగా చేయాలి : అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్




కోరుట్ల అమృత్ తెలంగాణ మే 15: జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు, రవాణా, అన్‌లోడింగ్ ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ ఆదేశించారు. గురువారం కోరుట్ల మండలంలోని జోగిన్‌పల్లి గ్రామంలోని మూడు రైస్ మిల్లులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మిల్లుల్లో జరుగుతున్న ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించి, రెండు పాయింట్ల వద్ద అన్‌లోడింగ్ కొనసాగుతుండగా, నిన్న రాత్రి, ఈరోజు ఉదయం చేరుకున్న 6 నుండి 8 వాహనాలు వేచివున్నట్లు గుర్తించారు. ఈ ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.


# పశువుల వల్ల రోడ్డు ప్రమాదాలు

## పశువులను రోడ్లపై వదిలేస్తే యజమానులపై కఠిన చర్యలు : జగిత్యాల ఎస్ఐ: పి. కరుణాకర్




జగిత్యాల అమృత్ తెలంగాణ మే 15: ప్రజల భద్రత దృష్ట్యా రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతున్న పశువులు మరియు ఇతర జంతువుల కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ముఖ్యంగా రాత్రి సమయాల్లో మరియు రద్దీ రహదారులపై ఆవులు, ఎద్దులు, గేదెలు, కుక్కలు తదితర జంతువులు అకస్మాత్తుగా రోడ్డుపైకి రావడం వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కావున పశువుల యజమానులు తమ జంతువులను రోడ్లపై వదిలివేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవలెను. తమ పశువులను సురక్షిత ప్రదేశాల్లో కట్టివేయడం, సరైన పర్యవేక్షణలో ఉంచడం చేయవలెను. ప్రజల ప్రాణాలకు మరియు ఆస్తులకు హాని కలిగించే విధంగా జంతువులను నిర్లక్ష్యంగా రోడ్లపై వదిలివేస్తే సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకోబడును. ఒకవేళ యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లయితే, వారిపై కేసులు నమోదు చేసి, ఆవులు మరియు ఇతర పశువులను గోశాలలకు తరలించడం జరుగుతుంది. ప్రజల సహకారంతోనే రోడ్డు ప్రమాదాలను నివారించగలము. అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి పోలీసు శాఖకు సహకరించవలసిందిగా కోరుచున్నాము.

# ముందస్తు అప్రమత్తతతో విపత్కర సమయాల్లో నష్ట నివారణ: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా






అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ ముందస్తు అప్రమత్తత ద్వారానే విపత్కర సమయాల్లో నష్టపోకుండా ఉండగలుగుతామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. భవిష్యత్తులో వచ్చే విపత్తులను ఎదుర్కునేందుకు సన్నద్ధతపై నిర్వహించనున్న మార్క్ ఎక్సర్సైజ్ వివరాలను హైదరాబాద్ నుండి కేంద్ర పర్యావరణ విపత్తు సంస్థ మినిస్ట్రీ ఆఫ్ హోం అఫైర్స్ డైరెక్టర్ నుండి మేజర్ జనరల్ సుధీర్ బేహాల్, ప్రిన్సిపల్ సెక్రటరీ రెవెన్యూ హరిచందన దాసరి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 18వ తేదీన, వై ఎస్ ఆర్ కాలనీలో విపత్కర పరిస్థితులు ఎదుర్కొనేలా మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మాక్ ఎక్సర్సైజ్ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు అంతా భాగస్వామ్యం అవ్వాలని అన్నారు. ఇటువంటి ముందస్తు సన్నద్ధత ద్వారా ప్రజల్లో విపత్కర పరిస్థితుల సమయాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై అవగాహన ఏర్పడుతుందని అన్నారు. ముందస్తు చర్యల వల్ల ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా కాపాడుకోగలుగుతామని తెలిపారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, అగ్నిమాపక శాఖ అధికారి ప్రభాకర్, సిపిఓ జీవరత్నం, డిఎంహెచ్ఓ రాజేందర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సమయానికి స్పందించి మహిళ ప్రాణాలను కాపాడిన భైంసా బ్లూ కోర్ట్ సిబ్బంది

## సకాలంలో స్పందించి మహిళ ప్రాణాలను కాపాడిన బ్లూ కోల్టు సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల



అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ భైంసా టౌన్ పరిధిలోని గడ్డెన్న వాగులో పెద్ద లింబ గ్రామానికి చెందిన ఒక మహిళ కుటుంబ కలహాలు, భర్తతో తలెత్తిన తగాదాల కారణంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడబోతోందని డయల్-100కు సమాచారం అందింది. సమాచారం అందిన వెంటనే విధుల్లో ఉన్న భైంసా బ్లూ కోర్ట్ సిబ్బంది అప్రమత్తమై సంఘటన స్థలానికి చేరుకొని, ఆ మహిళను ఆత్మహత్య చేసుకోకుండా సమయానికి అడ్డుకుని సురక్షితంగా బయటకు తీసుకువచ్చి మహిళకు ధైర్యం చెప్పి, కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. సకాలంలో స్పందించిన బ్లూ కోల్టు సిబ్బంది చరణ్ ను జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ప్రత్యేకంగా అభినందించారు.

# రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వెంట వెంటనే గోదాములకు చేర్చాలి : జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా





అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వెంట వెంటనే గోదాములకు తరలించి భద్రపరచాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సారంగాపూర్ మండలంలోని చించోలి (బి) గ్రామంలో గల గోదామును పరిశీలించారు. ధాన్యం అన్లోడ్ అవుతున్న తీరును చూశారు. అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఇప్పటివరకు గోదాములో నిల్వచేసిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. తగినంత మంది హమాలీలతో అన్లోడింగ్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి, లారీలను వేగవంతంగా ఖాళీ చేయాలన్నారు. అన్లోడింగ్ పూర్తయిన వెంటనే లారీలు తిరిగి కొనుగోలు కేంద్రాలకు తిరిగి పంపాలని తెలిపారు. ఎక్కడ కూడా కొనుగోలు కేంద్రాలలో తూకం వేసిన ధాన్యం నిల్వ ఉండరాదని అన్నారు. ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని తెలిపారు. ఈ గోదాము పరిశీలన ప్రక్రియలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్ తహసిల్దార్ విజయ కాంతారావు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# భూ కబ్జాలు, నకిలీ పత్రాలు సృష్టించే ముఠాపై మావల పోలీసులు ఉక్కుపాదం

## మరొక నిందితురాలు అరెస్ట్ - నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు స్వాధీనం నిందితురాలు మాజీ కౌన్సిలర్ భార్య : మావల సీఐ కర్ర స్వామి



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్ మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని కేఆర్కే కాలనీ ప్రాంతంలో ఖాళీ స్థలాలను లక్ష్యంగా చేసుకొని భూ కబ్జాలు, నకిలీ పత్రాల సృష్టి, అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్న ముఠాపై మావల పోలీసులు కీలక చర్యలు చేపట్టారు. ఈ కేసులో భాగంగా షబానున్నీసా (36) అనే మహిళను పోలీసులు అరెస్ట్ చేయడం జరిగిందని మావల సీఐ కర్ర స్వామి తెలిపారు. రుయ్యాడి గ్రామానికి చెందిన దొనకొండ బేబీతాయ్ ఫిర్యాదు మేరకు, ఆమెకు చెందిన ప్లాట్ నెం.49, 50లను నకిలీ మున్సిపల్ రికార్డులు, కట్టుకథల లింక్ డాక్యుమెంట్లతో అక్రమంగా ఆక్రమించి, అసలు యజమానులను బెదిరించినట్లు కేసు నమోదు చేయబడింది. దర్యాప్తులో మాజీ కౌన్సిలర్ పైక్ రావు ఆనంద్, సద్దాం హుస్సేన్, లంబిలే సంతోష్, బోదకుంట రాజు, షేక్ షాదుల్లా తదితరులు ఖాళీ స్థలాలను గుర్తించి, నకిలీ పత్రాలు సృష్టించి అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. మావల ఇన్స్పెక్టర్ కె. స్వామి ఆధ్వర్యంలో చేపట్టిన దర్యాప్తులో, శ్రీ నిలయం అపార్ట్మెంట్ వద్ద షబానున్నీసాను అదుపులోకి తీసుకుని విచారించగా, నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాల తయారీలో తన పాత్రను అంగీకరించింది. ఆమె వద్ద నుంచి డాక్యుమెంట్ నెం.5685/2023కు సంబంధించిన నకిలీ సేల్ డీడ్ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాకు సంబంధించి మరికొందరు నిందితులు ఇదివరకే అరెస్ట్ అయి రిమాండ్లో ఉన్నారు. రెవెన్యూ, మున్సిపల్ శాఖల ధృవీకరించిన రికార్డుల ఆధారంగా బాధితుల అసలు యాజమాన్యాన్ని పోలీసులు నిర్ధారించారు.

ప్రజలకు విజ్ఞప్తి:

మావల, కేఆర్కే కాలనీ పరిసర ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు కలిగిన యజమానులు తమ ఆస్తులను తరచుగా పరిశీలించుకోవాలని, ఈసీ మరియు మున్సిపల్ రికార్డులను తనిఖీ చేసుకోవాలని సూచించారు. భూ కబ్జాలు, నకిలీ పత్రాలు, బెదిరింపులకు గురైన వారు భయపడకుండా మావల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. బాధితులకు పూర్తి రక్షణ కల్పించి, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

# జొన్నల కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు

## రైతులతో మాట్లాడి సమస్యలు, మార్కెట్ సదుపాయాలపై ఆరా తీసిన మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



సెక్రెటరీ తో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్: రైతులు పండించిన జొన్న పంటను త్వరితగతిన కొనుగోలు చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ మార్కెట్ యార్డును సందర్శించిన ఆయన రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పంట దిగుబడి, కొనుగోలు ప్రక్రియ, మార్కెట్లో కల్పిస్తున్న సదుపాయాలపై రైతులను అడిగి వివరాలు సేకరించారు. రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగిస్తున్నామని తెలిపారు. జొన్నల కొనుగోలు ప్రక్రియలో గన్ని బ్యాగుల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మార్కెట్ యార్డులో రైతుల సౌకర్యార్థం టెంట్లు, చల్లటి తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచుతున్నామని, అందులో భాగంగానే శుక్రవారం కజ్జర్ల, జరి, భీంపూర్ గ్రామాల్లో కొత్త కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు వెల్లడించారు. షెడ్యూల్ ప్రకారం రైతులు మార్కెట్ యార్డుకు జొన్నలను తీసుకువచ్చి అధికారులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యులు,సిబ్బంది,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

# హౌస్ లిస్టింగ్ ప్రక్రియలో అధికారులకు ప్రజలు సహకరించాలి: హౌస్ లిస్టింగ్ ప్రక్రియ పూర్తి చేసుకున్న జిల్లా కలెక్టర్ భవేశ మిశ్రా



అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ జనగణన ప్రక్రియలో భాగమైన హౌస్ లిస్టింగ్ జాబితా తయారీకి జనగణన సిబ్బందికి, ప్రజలంతా సహకరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా కోరారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు నందు, జనగణనలో భాగంగా, తన నివాసానికి సంబంధించి, హౌస్ లిస్టింగ్ ప్రక్రియను కలెక్టర్ భవేశ్ మిశ్రా పూర్తి చేసుకున్నారు. ముందుగా తాను ఆన్ లైన్ లో పూర్తి చేసుకున్న సెల్ఫ్ ఎన్యుమరేషన్ వివరాలు, జనగణన సిబ్బందికి తెలియజేశారు. ఆ వివరాల ఆధారంగా, అధికారులు కలెక్టర్ హౌస్ లిస్టింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. కలెక్టర్ నివాస గృహ హౌస్ లిస్టింగ్ ప్రక్రియ పూర్తి చేసిన వారిలో సూపర్వైజర్ బి. రాజేందర్, ఎన్యుమరేటర్ లు హిమబిందు, నాగలత, తదితరులు ఉన్నారు.

# మండుటెండలో మారుమూల ప్రాంతం ఆత్నాం గూడలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యటన

## సంబురపడ్డ ఆదివాసులు బ్యాండు మేళంతో ఘన స్వాగతం

## చెప్పింది చేస్తా - చేసేదే చెప్తా

## నా ప్రజల కోసం ప్రకృతిని లెక్క చేయను

## పిలిచిన ప్రతీ పిలుపుకు పలకరిస్తా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ తాంసి మండలంలోని మారుమూల ప్రాంతమైన ఆత్నాం గూడ గ్రామంలో శుక్రవారం మిట్ట మధ్యాహ్నం మండుటెండలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యటించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన సవారీ షెడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. తమ గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే గారికి ఆత్నాం గూడ ఆదివాసులు బ్యాండు మేళలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. నా ప్రజల పిలుపే నాకు ముఖ్యం వారి కొరకు ప్రకృతిని లెక్కచేయనని అన్నారు. మారుమూల గ్రామమైన ఆత్నాం గూడ గ్రామ ప్రతీ సమస్యను విన్నాను కచ్చితంగా మళ్ళీ వస్తానని అన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు గ్రామంలో రూ. 10 లక్షలతో షెడ్డు నిర్మాణం చేయడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో ఆట్నం గూడ గ్రామస్తులు గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరారు. వారికి ఆనాడు హామీ ఇచ్చాను, గ్రామ పంచాయతీగా చేసి హామీ నెరవేర్చుకున్నాను. తప్పకుండా గ్రామస్తులు తెలిపిన కోరికలను దశల వారిగా నెరవేరుస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# పుస్తకాల వితరణలో అధికారులంతా భాగస్వామ్యం అవ్వాలి: జిల్లా కలెక్టర్ భవేశ మిశ్రా




అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ పుస్తకాల వితరణలో అధికారులంతా పెద్ద ఎత్తున భాగస్వామ్యం అవ్వాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పిలుపునిచ్చారు. "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా చేపట్టిన విద్యా వారోత్సవాలను పురస్కరించుకొని చేపట్టిన పుస్తక వితరణ కార్యక్రమంలో భాగంగా, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, కలెక్టరేట్ లోని తన చాంబర్ లో, శుక్రవారం పలు పుస్తకాలను జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్నకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులంతా పుస్తక వితరణ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భాగస్వామ్యం అవ్వాలన్నారు. పిల్లలకు, విద్యార్థులకు ఉపయోగపడే, వివిధ అంశాలలో జిజ్ఞాస పెంపొందించేలా ఉండే పుస్తకాలను డిఈఓ కు అందించాలని అన్నారు. అధికారులు అందించిన పుస్తకాలు అన్నిటిని లైబ్రరీలకు, పాఠశాలకు అందివ్వాలని డిఈఓ కు సూచించారు.

# డెంగ్యూ వ్యాధి నివారణకు సమిష్టిగా కృషి చేయాలి : జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ మే 15, 2026: జిల్లాలో డెంగ్యూ వ్యాధి నివారణకు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఈ నెల 16వ తేదీన జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఎస్. అనిత, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్, అధికారులతో కలిసి డెంగ్యూ నివారణపై గోడప్రతులు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కీటక జనిత వ్యాధుల నిర్మూలన కోసం ముందస్తు చర్యలు చేపట్టాలని, ఎండాకాలం నుండి వర్షాకాలం ప్రారంభమయ్యే సమయంలో వాతావరణంలో దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. దోమల ద్వారా మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, జికా వ్యాధులు వ్యాపిస్తాయని, పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. డెంగ్యూ జ్వరము ఎముకలు, కండరాలు, కీళ్ల నొప్పులతో కూడిన తీవ్ర జ్వరము అకస్మాత్తుగా వస్తుందని, కళ్ళలో నొప్పి, శరీరంపై చిన్నపాటి దద్దుర్లు కనిపిస్తాయని తెలిపారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పరీక్ష చేయించుకోవడానికి రాపిడ్ డయాగ్నొస్టిక్ కిట్లు అందుబాటులో ఉన్నాయని, జిల్లాలో తెలంగాణ డయాగ్నొస్టిక్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఎలిసా టెస్ట్ అందుబాటులో ఉందని, ప్రజలు ఎలాంటి భయాందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. దోమల నివారణలో భాగంగా వారానికి ఒకసారి డ్రైడే పాటించాలని, ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా చూడాలని, మురుగు కాలువలలో చెత్తా చెదారం తొలగించాలని తెలిపారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో తగు చర్యలు చేపట్టాలని, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సంబంధిత శాఖల సమన్వయంతో పని చేస్తూ జిల్లాలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు . ప్రజలందరూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేరియా టెక్నికల్ సూపర్వైజర్ రవి కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

# కేజీబీవీ పాఠశాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

## 38 లక్షలతో అదనపు గదులు, మౌలిక సదుపాయాల నిర్మాణానికి శంకుస్థాపన



అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ మామడ మండలం న్యూసాంగ్వీ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో రూ. 38 లక్షలతో మౌలిక సదుపాయాల కల్పనకు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ గారు శంకుస్థాపన చేశారు. ఇందులో అదనపు గదుల నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. భవిష్యత్తులో నియోజకవర్గంలో పాఠశాల అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకువచ్చి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, కొండ్ర రాజారెడ్డి, డీఈఓ భోజన్న, డిఇ గంగాధర్, ఏఈ ఆంజనేయులు, గ్రామ సర్పంచ్ అశ్విన్ రెడ్డి, మండల నాయకులు బాపురెడ్డి, గోవర్ధన్ రెడ్డి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కలిసికట్టుగా పనిచేద్దాం

## మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డిని సన్మానించిన కంది శ్రీనివాస్ రెడ్డి



మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డిని సన్మానిస్తున్న కంది శ్రీనివాస్ రెడ్డి


అమృత తెలంగాణ అదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్: ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో రాబోయే అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేలా నాయకులు, కార్యకర్తలు అందరూ సమన్వయంతో పనిచేయాలని నియోజకవర్గ ఇంచార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బోరంచు శ్రీకాంత్ రెడ్డి గురువారం రాత్రి ప్రజాభవన్‌లో కంది శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శ్రీకాంత్ రెడ్డి కూడా కంది శ్రీనివాస్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, గత ఎమ్మెల్యే ఎన్నికల్లో తన విజయం కోసం శ్రీకాంత్ రెడ్డి అహర్నిశలు కష్టపడి పనిచేశారని కొనియాడారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన శ్రీకాంత్ రెడ్డికి రైతుల సమస్యలపై పూర్తి అవగాహన ఉందని, అలాంటి వ్యక్తికి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బాధ్యతలు రావడం సంతోషకరమని పేర్కొన్నారు. రాబోయే ప్రతి ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి : సీపీఐ(ఎం) జిల్లా కమిటీ డిమాండ్




అమృత తెలంగాణ పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం నగరంలోని సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ.. కేంద్రంలో బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎన్నికల కన్నా ముందు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచమని ప్రజలకు హామీ ఇచ్చి, ఎన్నికల అనంతరం పెట్రోల్ డీజిల్ ధరలను పెంచడం ప్రజలను మోసం చేయటమే అవుతుందని విమర్శించారు. గత 12 సంవత్సరాలుగా దేశ ప్రజల పైన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి ప్రజలపై మోయలేని భారాలను వేశారని, ప్రజల దృష్టిని మరల్చడం కొరకు జాతీయతా భావం, మతం ముసుగులో ప్రజలను మోసం చేస్తున్నారని. ఇప్పుడు పెంచిన పెట్రోల్, డీజిల్ ధరల మూలంగా సాధారణ మధ్యతరగతి ప్రజానికం పై నిత్యవసర సరుకుల ధరలు పెరిగి ప్రజలపై మరింత భారం పడుతుందని ఇది సరైన పద్ధతి కాదని ,ప్రభుత్వం వెంటనే పెంచిన ధరలను తగ్గించాలని ఐదు రాష్ట్రాల ఎన్నికల కన్నా ముందు ప్రజలకు చెప్పిన మాటను నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనియెడల రాబోయే కాలంలో నరేంద్ర మోడీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని ఆయన హెచ్చరించారు. రేపు పార్టీ ఆధ్వర్యంలో ఆయా కేంద్రాలలో నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తామని, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శంకర్ గౌడ్, పి.వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు సుజాత, మరియు నగర నాయకులు నరసయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# బికినీలో నాగిని బుసలు కొడుతోందే!



బాలీవుడ్ బ్యూటీ మౌనీ రాయ్ హాటెస్ట్ ఎలివేషన్స్ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఆందాల ఆరోబోతలో అమ్మడు ముందు వరుసలో ఉంటుంది. పూల్ సైడున టూపీస్.. స్విమ్ షూట్ బికినీల్లో చేసే రచ్చ అంతా ఇంతా కాదు. తెరచిన పుస్తకం వలే బ్యూటీ అందాలు ఆరబోస్తుంది. ఇసుక తిన్నెల్లో అందాల ఆరబోతతో ఇసుక తుఫాన్లే రప్పిస్తుంది. సందర్భం ఏదైనా మౌని టెంప్టింగ్ ఫోజులకు ఫ్లాట్ అవ్వాల్సిందే. అంతగా గ్లామర్ ఎలివేషన్ పై దృష్టి పెడుతుంది. తాజాగా అమ్మడు మరోసారి టూపీస్ లో చెలరేగిపోయింది. రిసార్ట్ లోఅమ్మడు పూల్ సైడున పువ్వుల పీస్ లో అందాల విందు చేసింది. థై అందాలు..నాభి అందాల ఎక్స్ ఫోజ్ ని పీక్స్ కి తీసుకెళ్లింది. గాల్లోకి ఎగురుతూ మరీ క్యామ్ ఫోజులిచ్చి అమ్మడి అందాలు ఎలివేట్ చేస్తోంది. ఇక రిసార్ట్ గదిలో బ్రౌన్ కలర్ డిజైనర్ దుస్తుల్లోనూ నాగిని తళుక్కున మెరిసింది. టూపీస్ లో పోలిక కాస్త కష్టమైనా గోధుమ రంగు దస్తుల్లో క్లోజ్ సెల్ఫీ షాట్ లో నాగిని అవతరామే ఎత్తింది. ప్రస్తుతం ఈ రెండు ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి. నెటిజనులు హాట్ కామెంట్లతో ఎటాకింగ్ దిగారు. మౌని రాయ్ మల్టీట్యాలెంటెడ్ గాళ్. మోడలింగ్ నుంచి గాయనిగా అటుపై నటిగా ఫేమస్ అయింది. సినిమా లకన్నా ఎక్కువగా టీవీషోలతోనే మౌనీరాయ్ ఫోకస్ అయింది. పాప్ ఆల్బమ్ సింగర్ గాను మౌని మెరుపులు మెరిపించిం ది. అయితే నటిగా మాత్రం నిలదొక్కుకోలేదు. బాలీవుడ్ లో కొన్ని సినిమాల్లో నటించినప్పటికీ అవి యాక్టింగ్ అంతగా స్కోప్ లేని చిత్రాలుగానే ఉన్నాయి. కేజీఎఫ్ చాప్టర్ -1లో స్పెషల్ అప్పీరియన్స్ తో సౌత్ లో కొంచెం పేరొచ్చింది. ప్రస్తుతం బాలీవుడ్ లో బ్రహ్మాస్త్ర లో నటిస్తుంది. ఇది మౌని కెరీర్ లో బిగెస్ట్ ఫిల్మ్. అమితాబచ్చన్..నాగార్జున ..రణబీర్ కపూర్ ..అలియా భట్ .. డింపుల్ కపాడియాతో కలిసి మౌని తెరను పంచుకుంటుంది. బ్రహ్మాస్త్ర మౌనీ రాయ్ కెరీర్ ని టర్న్ చేసే చిత్రంగానే భావించొచ్చు. ప్రాజెక్ట్ పై అమ్మడు భారీగానే ఆశలు పెట్టుకుంది.

# కృతి శెట్టి.. శ్రీలీలా ఇప్పుడు మృణాల్ ఠాకూర్



ఉప్పెన సినిమా విడుదలకు ముందే కృతి శెట్టి కి బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లు వచ్చాయి. ఆ సినిమా కరోనా వల్ల ఆలస్యం అవ్వడంతో కృతి శెట్టి కెరీర్ ఏమవుతుందో అనే అనుమానాలు కొందరు వ్యక్తం చేశారు. కాని ఉప్పెన ఆలస్యంగా వచ్చిన సూపర్ హిట్ సాధించింది. ఉప్పెన విడుదలకు ముందు నుండే వచ్చిన ఆఫర్లు విడుదల తర్వాత మరింతగా ఎక్కువ అయ్యాయి. ప్రస్తుతం కృతి శెట్టి ఇండస్ట్రీలో ఎన్ని సినిమాల్లో నటిస్తుందో.. ఎన్ని హిట్స్ దక్కాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇక పెళ్లిసంద సినిమా తో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన క్యూటీ శ్రీ లీలా. ఆ సినిమా ఫ్లాప్ అయినా కూడా శ్రీలీలా బిజీ బిజీగా సినిమాలు చేస్తున్న విషయం తెల్సిందే. పెళ్లిసంద సినిమా విడుదలకు ముందు నుండే శ్రీ లీలా సందడి మొదలు అయ్యింది. ఇప్పుడు మృణాల్ ఠాకూర్ కూడా ఆ జాబితాలో చేరింది. బాలీవుడ్ ప్రేక్షకులకు సుపరిచితురాలైన మృణాల్ తెలుగు లో ఎంట్రీ ఇచ్చేందుకు సిద్దం అయ్యింది. తెలుగు సినిమా విడుదలకు ముందే ఈమె సోషల్ మీడియా లో షేర్ చేసిన ఫోటో ల ద్వారా ఇక్కడ కూడా పాపులారిటీని దక్కించుకుంది. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న సీతారామం తో తెలుగు ప్రేక్షకుల ముందుకు మృణాల్ రాబోతుంది. ఇప్పటికే విడుదల అయిన ఫస్ట్ లుక్ తో తెలుగు ప్రేక్షకులను ఈ అమ్మడు అలరించింది. ముందు ముందు ఈ అమ్మడికి టాలీవుడ్ లో మంచి అవకాశాలు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్న తరుణంలోనే పలువురు టాలీవుడ్ ఫిల్మ్ మేకర్స్ ఈ అమ్మడి కాంటాక్ట్ కు ప్రయత్నాలు చేస్తున్నారట. సీతారామం విడుదల అయ్యే సమయం కు మృణాల్ చేతిలో మరో రెండు మూడు సినిమాలు ఉండే అవకాశం ఉంది. హను రాఘవపూడి హీరోయిన్స్ ను చాలా అందంగా విభిన్నమైన పాత్రల్లో చూపించి వారు జనాల్లో నోటెడ్ అయ్యేలా చేస్తాడు. కనుక సీతారామం సినిమా తో మృణాల్ కూడా ఖచ్చితంగా టాలీవుడ్ లో నోటెడ్ అవ్వబోతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. హీరోయిన్ గా బాలీవుడ్ లో సినిమాలు చేస్తూనే టాలీవుడ్ లో కూడా టాప్ స్టార్ హీరోయిన్ గా ఈ అమ్మడు పేరు దక్కించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ఆద్యంతం థ్రిల్లింగ్ గా సాగిన 'డ్రైవర్ జమున' జర్నీ..!




కోలీవుడ్ లో హీరోయిన్ గా రాణిస్తున్న ఐశ్వర్య రాజేష్.. తెలుగు ప్రేక్షకులకు కూడా సుపరిచితమే. నటనా ప్రాధాన్యమున్న పాత్రల్లో మెపిస్తూ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది. ఆమె నటుడు రాజేష్ కుమార్తె.. హాస్యనటి శ్రీలక్ష్మి మేనకోడలు. పలు డబ్బింగ్ చిత్రాలతో పలకరించిన ఈ భామ.. 'కౌసల్య కృష్ణమూర్తి' అనే సినిమాతో టాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చింది. ఈ క్రమంలో మిస్ మ్యాచ్' 'వరల్డ్ ఫేమస్ లవర్' 'టక్ జగదీశ్' 'రిపబ్లిక్' వంటి సినిమాలో మెరిసింది. ఇప్పుడు "డ్రైవర్ జమున" అనే చిత్రంతో అలరించడానికి రెడీ అయింది. ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రలో పి.కిన్ స్లిన్ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా సినిమా "డ్రైవర్ జమున". ఇందులో ఆమె ఒక క్యాబ్ డ్రైవర్ గా కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ ఈ చిత్రంపై ఆసక్తిని కలిగించింది. ఈ నేపథ్యంలో తాజాగా టాలీవుడ్ సీనియర్ ప్రొడ్యూసర్ దగ్గుబాటి సురేశ్ బాబు ట్రైలర్ ను రిలీజ్ చేసి చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు. మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చిన జమున అనే ఓ లేడీ క్యాబ్ డ్రైవర్ జీవితంలో జరిగిన సంఘటనల నేపథ్యంలో.. ఈ క్రైమ్ థ్రిల్లర్ తెరకెక్కించారని అర్థం అవుతోంది. ట్విస్టులు కీలక మలుపులతో ఆద్యంతం థ్రిల్లింగ్ గా సాగిన 'డ్రైవర్ జమున' ట్రైలర్ ఆకట్టుకుంటోంది. ఆడపిల్లలు డ్రైవింగ్ ఫీల్డ్ లో చాలా కష్టపడతారు అని ఇంట్లో వాళ్ళు వారిస్తున్నా.. అవేవీ లెక్క చేయకుండా జమున క్యాబ్ డ్రైవర్ గా వెళ్ళింది.




# హీరోయిన్ రేంజ్ అందాల ఆరబోత



తెలుగు బిగ్ బాస్ నాన్ స్టాప్ లో కొన్ని వారాల పాటు ఎంటర్ టైన్ చేసిన స్రవంతి తనదైన శైలి రాయలసీమ యాస తో ఆకట్టుకుంది. బుల్లి తెరపై సుదీర్ఘ కాలంగా కనిపిస్తూ వస్తున్న ఈమె బిగ్ బాస్ తో మరింత పాపులారిటీని దక్కించుకుంది. బిగ్ బాస్ తో వచ్చిన పాపులారిటీతో సోషల్ మీడియాలో స్రవంతి కుమ్మేస్తోంది. గతంలో కూడా స్రవంతి తన హాట్ ఫోటోలను షేర్ చేసేది. కానీ ఇప్పుడు ఇంకాస్త ఎక్కువ అన్నట్లుగా ఈ అమ్మడు రెచ్చి పోతుంది. హీరోయిన్స్ కు ఏమాత్రం తగ్గకుండా ఈమె తన అందాలతో సోషల్ మీడియా లో జనాలకు హీట్ పెంచుతోంది. అందమైన ఈ అమ్మడి ఫిజిక్ తో పాటు మంచి బాడీ లాంగ్వేజ్ వల్ల హీరోయిన్ మాదిరిగా ఉందనే కామెంట్స్ కూడా వస్తున్నాయి. బిగ్ బాస్ తో గుర్తింపు దక్కించుకున్న అషు రెడ్డి.. దివి ఇంకా చాలా మంది కూడా ఇప్పుడు సోషల్ మీడియాలో అందాలు ఆరబోస్తూ ఫాలోవర్స్ ను విపరీతంగా పెంచుకుంటున్నారు. అయితే వారిలో ఎక్కువ శాతం మంది పెళ్లి కాని వాళ్లు ఉన్నారు. అయితే స్రవంతి కి పెళ్లి కావడంతో కొందరు ఈ అందాల ఆరబోత ఫోటోలను విమర్శిస్తూ ఉన్నారు. సినిమాల్లో నటిగా ఈమె కు ఆఫర్లు చిన్నా చితకా సినిమాల నుండి వస్తున్నాయనే వార్తలు కూడా వస్తున్నాయి. ప్రస్తుతానికి సోషల్ మీడియాలో సందడి చేస్తున్న ఈమె బుల్లి తెర మరియు వెండి తెర ద్వారా పాపులారిటీని మరింతగా పెంచుకుని స్టార్ గా నిలుస్తుందేమో చూడాలి.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com